"కల్లేనం ఆగిపోనాదండి!"

"అర్ధాంతరంగా ఆపుసేసీసినారండి"

"నాను సెప్పిందేటి? మీరు సేస్తున్నదేటి? యి పెల్లి జరిపీడాని కీల్లేదని అడ్డెట్టీసినారండి సీనివోసుబావు".

# మొక్కుబడి

రావి.ఎస్. అవధాని




"రామిరెడ్డి గోరి బొట్టెడండి. అంజిరెడ్డి గోరి మనవొడండి".

"పట్నంల కాన్మెంటు సదూతున్నారండి".

"తప్పిదవంతా అంజిరెడ్డి గోరి దేనండి"

"ఆరికి కరసేరనాలాడ నేదండి. మరి పల్లకుండి పోనారండి".

"పెల్లి సూడొచ్చిన జనాలు వొసిలి పోనారండి".

"రాంవొరంల అంజిరెడ్డి గోరు పెద్దమోతుబరండి. వూర్లసగం బూవి ఆరిదేనండి. ఆరినోగిలి దరమ సాయిడీ అండి".

"ఆరివూసొగ్గిండి. వూర్లంతా నాయుడోల్లేనండి. అందరికీ బూవొసతి పాడి పసరాలువ్నోరేనండి.

"వూర్ల పెతి నాయురోలొంటిన పదికాసులు బంగారు సొమ్ములండి. మరియెండి సొమ్ములు కొదవనేదండి - అందెలు, కడేలు, సందలు మురుకులు, పోచీలు, దండ కడేలు.

"సెప్పాలంటే బూ వొసతి నేనోరు మెరగ్గూడేపోల్లండి.

"పొట్ట కూటి కోసం పారొచ్చీసినోరండి. ఆరందరికీ గూడు ఏపించేరు అంజిరెడ్డి గోరండి.ఆల్లకి వూర్ల సేతి నిండా పనిదొరకతదండి. కూటిక్కొదవనేదండి.

"రాంవొరం ఆరొందల గడపండి. ఆరీదుల గేమవండి. గుడులీదికి దాపలేవు మూడీదులు, ఎలపలేవు రెండీదులు, మెరగ్గూడేంబగ్గీసండి.

"గుడు లీది యీ సివర సింత సెట్టు మొగుదల రాంమందిరవండి. అటుసివొర్న అనుమంతోరి గుడండి. యేపసెట్టు కింద అసిరమ్మ గటాల దింపుడు సీడీల కాడండి.

"అనుమంతోరి యిగ్గరం అంజిరెడ్డి ముత్తాత గోరికి వూర్ల సెరివిలో అవుపించిందండి. వొట్టు గొచ్చి గుడిల ఎట్టించేరండి.

"అనుమంతోరి యిగ్గరం నాలుగు బారల నిలువండి. బార మందవండి.

"అనునముంతోర్ల మాసెడ్డ మగత్తెం వుందండి. మొక్కుల్దీరిసేదేవుడండి. దూరాబారం జనాలు మొక్కుబడిసేస్తారండి.

"వూర్ల సిన్నా పెద్దా పెందిలి పలకర్ర సేసి అనుమంతోరికి దన్డవెట్టందీ గంగ ముట్టరండి.

"అనునమంతోరికి దినావు కుంచెడు పులిగోరన్నం నయివేద్దం ఎడతారండి పంతులుగోరు.

"మరి రాములోరి గుల్లో బాల బోగం సేస్తారండి ఆసారి గోరు రాములోరికి ఏటికి ముమ్మారు కల్లేనం సేస్తారండి - కొత్తావసకి, సంకురేతిరికి. పెద్దేకాసి నాడండి.

"యీటి కరసులు అంజిరెడ్డి గోరివండి. ఆరు గుల్లకి దరమ కరతండి.

"అంజిరెడ్డి గోరి ఆరో పేనం మనవొడు సీనివోసు బావు.

"సీనివోసు బావు నాను కాన్మెంటు సదువు సదువుతానన్నాడండి.

"అంజిరెడ్డి గోరు ఆమట్న సీనివోసుల్నిన పట్నం తోలుకుపోయి కాన్మెంటుల ఎట్టేసినారండి. ఆరి ఆలనా పాలనా సూడ్డానికి పట్నంల ఏరే కాపరవండి.

"సీనివోసులు సెడ్డ సురుకండి.

"సదువుల్ల పట్టండి. పోటీల్ల యెండి కప్పు బగుమానం వుచ్చుకున్నారండి. ఆ సంబరంల దేవుడి కల్లేనం సేపిత్తానని మొక్కుకున్నారండి.

"అంజిరెడ్డి గోరికి మొక్కుబడి యిసయం సాయంగా సెప్పేరండి.

"మనవొడి సేత కల్లేనం గనంగా సేపిత్తానని ఎరేన్మెంట్లు సాయంగా సేసేరండి. పందిల్లు ఏపిసించి, తోరనాలు కట్టింపించేరండి.

"కల్లేనం సూడ్డానికి పట్నంల కాన్మెంటు టూడెన్ట్లు, మేట్టరమల్ని సీనివోసు బస్సుల తోలు కొమ్మచ్చినాడండి రాంవొరం.

"ఆరందరికీ కాపీ పలారాలు ఎట్టి గుల్లోకి తోలు కొచ్చేరండి అంజిరెడ్డిగోరు.

"కల్లేనానికి యిగ్గరాలు. సరుకులు మన్డపంల ఎట్టి ఆటికి సెరికో యేపు కూకున్నారండి ఆసారిగోరు. అనుమంతుల గుడి పంతులుగోరు.

"మన్డపంల కాన్మెంటు టూడెన్ట్లు, మేట్టరమ్మలు ముందొరసల కూకున్నారండి. ఆ రెనక వూర్ల నాయురోల్లు, పొన్నూరు ఆడోల్లు పల్లెంల పసుపు, కుంకం, పల్లు, పూలు ఎట్టుక్కూకున్నారండి. యిటేపు సన్నాయి మేల పోల్లు ఆరెనక వూర్ల మొగాల్లందరూ కూకున్నారండి. మెరగ్గూడేపోల్లు మండప ందిగూన దడికట్టునాగ నిల్సుండిపోనారండి.

"అంజిరెడ్డి గోరు మనవొడు సీనివోసుని పీట మీద కూకోబెట్టేరండి.

"సీనివోసులు యిగ్గరాల కేసి సూసి సివోలున నెగిసి పోనారండి.

"యిదేటి రాములోరు, సీతమ్మోరు యిగ్గరాలు ఎట్టేరు - రాములోరి కల్లేనం సేస్తారేటి?

"నాను సేస్తానంది. మొక్కింది "అనుమంతోరి" కల్లేనం. రాములోరి కల్లేనంగాదు.

"తాతా నాను అనుమంతోరి కల్లేనం సేస్తానని మొక్కుబడి యిసయం నీకు సెప్పేను గాదా? మరిదేటి?' సీనివోసులు బావు అంజిరెడ్డి దోరిని నిల్దీసినాడండి.

"తప్పు బావూ, అనుమంతోరు "బెమ్మసారి". ఆరికి కల్లేనం సెయ్యరు. రాములోరికే సెయ్యాల !" ఆసారి గోరు సీనివోసు బావుకు బోదసేసినారండి.

"సెత్తరాలు సెప్పకండి! బెమ్మసారికి పెల్లి సెయ్యక పెల్లయినోల్లకే సేస్తారా? పెల్లి! యీల్లేదు. నాకు అనునమంతోరి కల్లేనవే గావాల. నామొక్కుకు సెల్లు కట్టాల! అనీసి నారండి సీనివోసు బావు.

"అవును. ఆనుమంతోరి కల్లేనం సెయ్యాల! మావందరం అనుమంతోరి కల్లేనం సూడొచ్చినాం టూడెన్ట్ కుర్రోల్లు సపోరుటు సేసినారండి.

"అంజిరెడ్డి గోరు పల్లకుండి పోనారండి.

"కల్లేనం ఆగిపోనాదండి.

"మొక్కుబడి సెల్లుగానేదండి. ●

